
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 2 ఫిబ్రవరి 2025

క్రీడలతో మానసిక ప్రశాంతత

- హైకోర్టు న్యాయాధికారి సురేపల్లి నందా
- ఖమ్మంలో రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాద క్రీడలు ప్రారంభం 8



స్వర నీరాజనం...

- నవరత్న కీర్తనలతో ప్రత్యేక హారతుల సమర్పణ
- భక్తరామదాసు విగ్రహానికి అభిషేకం
- జ్యోతి ప్రజ్వలన చేసిన దేవస్థానం ఈవో
- శోభాయమానంగా శోభాయాత్ర
- వైభవోపేతంగా ప్రారంభమైన వాగ్గేయకార ఉత్సవాలు



నవరత్న కీర్తనలను ఆలపిస్తున్న సంగీత కళాకారులు



రామదాసు చిత్రపటంతో గిరి ప్రదక్షిణకు వెళ్తున్న దృశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండె వెలుగుగా నిలిచిన భక్తరామదాసు జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన నవరత్న కీర్తనలతో భద్రగిరి పులకరించింది. మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తరామదాసు చిత్రపటంతో శోభాయమానంగా సాగిన శోభాయాత్ర.. పంచామృతాలతో అపర భక్తాగ్రేసరుడు భక్తరామదాసు విగ్రహానికి అభిషేకం. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి జ్యోతి ప్రజ్వలనతో భద్రాద్రి రామక్షేత్రం సంగీత సాగరంలో తడిసి ముద్దయింది. భక్తరామదాసు 392వ జయంతి ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్థానిక చిత్రకూట మండపంలో ఈ ఉత్సవాలు ప్రారంభం కాగా.. ఈ సందర్భంగా మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్ పర్యవేక్షణలో భద్రాచల రామదాసు నవరత్న కీర్తనలతో వందలాది మంది సంగీత కళాకారులు రామయ్యకు నీరాజనం పలకడంతో రామభక్తులు ఒక్కసారిగా పరవశించారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ వాగ్గేయకార ఉత్సవాలు భద్రాచలం దేవస్థానం, శ్రీచక్రా సిమెంట్స్ లిమిటెడ్ సంయుక్త (మిగతా 8వ పేజీలో)

భార్యను చంపిన భర్త

- అనంతరం కత్తితో హల్‌చల్
- గోవిందాపురంలో ఘటన



8

నిరాశ మిగిల్చిన నిర్మలమ్మ పద్దు



కేంద్ర బడ్జెట్ 'లెక్క'ల్లో ఉమ్మడి జిల్లాకు దక్కని కేటాయింపులు

- 'విభజన' చట్టంలోని హామీల ఊసే లేని వైనం
- మళ్లీ నిరాశపరిచిన 'బయ్యారం ఉక్కు' అంశం
- ప్రతిపాదిత రైల్వేలైన్లకూ దక్కని నిధులు
- సుదీర్ఘ సమస్యల పరిష్కారానికి దక్కని హామీ
- ఆదాయ పన్ను మినహాయింపుతో ఉద్యోగులకు ఊరట

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎప్పటిలాగే ఈసారి కూడా కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కీలక అంశాలకు చోటు దక్కలేదు. ప్రధానమైన సమస్యలకు కూడా ఎలాంటి పరిష్కారం లభించలేదు. ముఖ్యంగా రాష్ట్ర విభజన హామీల్లో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావనకు రాలేదు. పునర్విభజన చట్టంలోని అంశాల అమలులో భాగంగా ఏపీకి సంబంధించి పోలవరం ప్రాజెక్టుకు ఈ ఏడాది నిధులు కేటాయించినా... బయ్యారం ఉక్కు పరిశ్రమపై మాత్రం ఊసులేదు.

అలాగే గోదావరి జాతీయ జలమార్గం, గోదావరి ప్రక్షాళన కార్యక్రమాలకు కూడా నిధులు కేటాయించలేదు. జాతీయ రహదారులు, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు, జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలకు సంబంధించిన నిధుల కేటాయింపులోనూ ఎలాంటి ప్రస్తావన లేదు. కొవ్వూరు-కొత్తగూడెం రైల్వేలైన్, భద్రాచలం- పాండురంగాపురం, భద్రాచలం- మల్కన్‌గిరి, మణుగూరు-రామగుండం, సత్తుపల్లి-కొండపల్లి రైల్వేలైన్ల విషయంలో కూడా బడ్జెట్‌లో ఎక్కడా ప్రకటన చేయలేదు. అయితే కేంద్ర బడ్జెట్‌లో శాఖల వారీగా, రాష్ట్రాల వారీగా కేటాయింపుల అనంతరం కొన్ని సమస్యలకైనా పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రజలు ఆశతో ఉన్నారు.

ఉద్యోగులకు ఊరట

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.12లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి పన్ను మినహాయింపు ప్రకటించడం మధ్యతరగతి వేతన జీవులను భారీ ఊరటనిచ్చింది. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొత్తగా (మిగతా 8వ పేజీలో)

ప్రజలకు ఉపయోగపడని బడ్జెట్

పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు



కేంద్ర బడ్జెట్ రాజకీయ కోణంలో ప్రవేశపెట్టడం తప్ప సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదు. నెహ్రూ నుంచి మన్మోహన్‌సింగ్ వరకు ప్రధానుల కాలంలో దేశ ఆర్థిక విధానంతో పోలిస్తే నేటి విధానం పూర్తి భిన్నంగా ఉంది. రాజ్యాంగాన్ని ఖూనీ చేసే విధంగా బీజేపీ పాలన కొనసాగుతోంది. అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టేందుకే చూశారు. ప్రజలకు ఏమి కావాలో అది ఇవ్వకుండా బడా సంపన్నులకు మేలు కలిగించే విధంగా ఉంది. మేధావులతో చర్చలు జరిపి బడ్జెట్‌ను తయారు చేస్తే బాగుండేది.

అంతా అంకెల గారడీ

రామసహాయం రఘురాంరెడ్డి, ఖమ్మం ఎంపీ



కేంద్ర బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీగా ఉంది. ప్రజలకు ఈ బడ్జెట్ వల్ల కలిగే మేలు ఏమీలేదు. కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటు ఆవశ్యకతను కేంద్రం విస్మరించింది. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రసంగంలో కేటాయించిన నిధుల్లో స్పష్టత లేదు. ఏడు కోట్ల మందికి క్రెడిట్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ అర్హులు అంతమందే ఉన్నారా.. బీహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్కడ మెప్పు పొందేందుకు మాత్రమే ఈ బడ్జెట్‌ను రూపొందించారు. ఉద్యోగులకు రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు బాగున్నా.. విశ్రాంత ఉద్యోగుల పట్ల పట్టింపు లేదు.

తెలంగాణపై వివక్ష చూపారు..

తాతా మధు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన బడ్జెట్ పూర్తిగా తెలంగాణ ప్రజలను నిరాశపరిచింది. నిధుల కేటాయింపులో రాష్ట్రం తీవ్ర వివక్షకు గురైంది. బడ్జెట్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు, పథకాలకు మోదీ సర్కార్ ఒక్క రూపాయి ఇవ్వలేదు. 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచినా.. రాష్ట్రానికి ఒరిగింది ఏమీలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం వరాలు ప్రకటించడం విడ్డూరంగా ఉంది.

ఇది సంపన్నుల బడ్జెట్

బాగం హేమంతరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు




కేంద్ర బడ్జెట్ ధనిక, కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాసేదిగా ఉంది. ఉపాధి రంగాలను విస్మరించటం శోచనీయం. వ్యవసాయం పట్ల ఉదాసీన వైఖరి అవలంబించారు. వ్యవసాయ అభివృద్ధికి తగిన కేటాయింపులు జరపలేదు. పేదవాళ్లను మరింత పేదవాళ్లగా.. సంపన్నులను మరింత సంపన్నులుగా చేసే బడ్జెట్ ఇది. ఉపాధిహామీకి నామమాత్రపు కేటాయింపులే చేశారు. బీమా రంగంలో నూరుశాతం ఎఫ్‌డీఐలను ఆహ్వానించటం ప్రైవేటీకరణకు మోదీ సర్కార్ పెద్దపీట వేసింది.

వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్

గల్లా సత్యనారాయణరావు, తాండ్ర వినోద్‌రావు, బీజేపీ నేతలు




కేంద్ర బడ్జెట్.. ప్రధాని మోదీ దార్శనికత స్వావలంబన, వృద్ధి, శ్రేయస్సుతో కూడిన వికసిత్ భారత్‌కు రోడ్‌మ్యాప్. రైతు సంక్షేమం నుంచి మధ్యతరగతి వరకు ఉపశమనం కోసం మహిళలు, యువతకు సాధికారిత కల్పించడం ప్రోత్సాహకరంగా ఉంది. మధ్యతరగతికి 40వేల గృహాలు బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం, రూ.12లక్షల వరకు ఇన్‌కంట్యాక్స్ లేకపోవడం ప్రజలకు మేలు.



భార్యను చంపిన భర్త

» అనంతరం కత్తితో హల్‌చల్
» గోవిందాపురంలో ఘటన



దుమ్ముగూడెం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గోవిందాపురంలో శుక్రవారంరాత్రి దారుణ హత్య జరిగింది. తాటి జయ(31)ను భర్త తాటి నరసింహారావు జననాంగ ప్రదేశంలో తాటికల్లు గీసే కత్తితో విచక్షణా రహితంగా కోసి చంపాడు. స్థానికుల వివరాల ప్రకారం... ఏపీ రాష్ట్రం ఏడుగురాళ్లపల్లికు చెందిన జయతో గోవిందాపురానికి చెందిన నరసింహారావుకు పద్నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా భార్య, భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారంరాత్రి భార్య జయపై నర్సింహారావు కత్తితో దాడిచేసి విచక్షణా రహితంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో భయాందోళనకు గురైన జయ రక్షణ కోసం సమీపంలోని ఓ ఇంటి వద్దకు పరుగెత్తి వెళ్లి అక్కడే ప్రాణాలు విడిచింది. ఇంట్లో గొడవ జరుగుతున్నప్పటికీ, ఎప్పుడు ఉండేదే కదా అని చుట్టు ప్రక్కల వాళ్లు సరిగ్గా పట్టించుకోలేదని తెలుస్తోంది. హత్య చేసిన అనంతరం నర్సింహారావు కత్తి పట్టుకొని తన భార్యను చంపానంటూ గోవిందాపురం, సీతానగరం గ్రామాల్లో తిరుగుతూ హల్‌చల్ చేశాడు. తెలిసిన వారికి ఫోన్ చేసి మరీ భార్యను చంపానని ఆనందంగా చెప్పినట్లు సమాచారం. నిందితుడు నర్సింహారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భార్య, భర్తలిరువురూ కొంతకాలం చేపల చెరువుల వద్ద కాపలా పని చేయగా, ప్రస్తుతం గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల కాలంలో గొడవ పడి పుట్టింటికి వెళ్లిన జయ చర్ల మండలం సత్యనారాయణపురంలో చదువుతున్న కొడుకును చూసేందుకు జనవరి31న అక్కడకు వెళ్లింది. ఈ విషయం తెలిసిన నర్సింహారావు అక్కడకు వెళ్లి భార్యను గోవిందాపురం తీసుకువచ్చాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో స్థానికంగా జరిగిన ఓ ఫంక్షన్‌కు భార్య, భర్తలిరువురూ హాజరయ్యారు. భార్యపై అనుమానంతో మద్యం మత్తులో హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతురాలి తల్లి కన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ బి.అశోక్ శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని పుల్లారెడ్డి బజార్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన నేల చిన్నరాజు (45), భార్య, ఇద్దరు కుమారులతో కలిసి సత్తుపల్లిలో ఓ ఫ్యాక్టరీలో వాటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన చిన్నరాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ కవిత తన సిబ్బందితో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నేల పెద్దరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

» హైకోర్టు న్యాయాధికారి సురేపల్లి నందా
» ఖమ్మంలో రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాద క్రీడలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయాధికారి నందా

ఖమ్మం ఫ్రిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ప్రశాంతతను, శారీర ధృఢత్వాన్ని కలిగిస్తాయని హైకోర్టు న్యాయాధికారి సురేపల్లి నందా పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలో మూడో రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాద క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. సాహెబ్ చౌదరి మెమోరియల్‌ట్రస్ట్ ఆద్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. స్థానిక సర్ధార్‌పటేల్ స్టేడియంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్‌తో పాటు హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్‌తో కలిసి ఆమె పారంభించారు. ఈ సందర్భంగా నందా మాట్లాడుతూ నిత్యం కేసులతో కుస్తీ పడుతున్న న్యాయవాదులకు మానసిక ఉల్లాసాన్ని పెంపోందించే విధంగా క్రీడలు దోహదపడతాయన్నారుజ క్రీడల వల్ల మానసిక సంబంధాలు మెరుగుపడతాయని, తాను స్పోర్ట్స్ సెక్రటరీగా ఉన్నప్పుడు చాలా క్రీడలు నిర్వహించారని గుర్తు చేశారు. అతిపిన్న వయసులోనే గుర్తింపు పొందిన హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ వలన భారత్‌కి మూడు బంగారు పతకాలు వచ్చాయని, అతనిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, క్రీడల్లో పాల్గొనడమే ప్రధానంగా భావించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని క్రీడల్లోనూ ముందుండాలని ఈసందర్భంగా ఆమె అకాంక్షించారు. ఈ విధంగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి మహిళలందరినీ ఒక్కతాటిపై తీసుకువచ్చిన నిర్వాహకుడు తాళ్ళూరి దిలీప్‌చౌదరిని అభినందించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకొని రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను ఖమ్మంలో నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లిసత్యనారాయణ, ఫెడరేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జేఏసీ నాయకులు తిరుమలరావు, ఖమ్మం బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్లశ్రీనివాసరావు, కార్యదర్శి వెంకట్, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, జిల్లా న్యాయాధికారులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ భవనానికి వందేళ్లు

» 10వ తేదీ వరకు వేడుకలు
» డీఎఫ్‌వో సిద్దార్థవిక్రమ్‌సింగ్



మాట్లాడుతున్న డీఎఫ్‌వో

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే తనకంటూ ఓప్రత్యేకతను చాటుకున్న ఖమ్మం అటవీ శాఖ కార్యాలయ భవనం వందేళ్ల పూర్తి చేసుకుంది. ఈనేపథ్యంలో పదిరోజులు అటవీశాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థవిక్రమ్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం వందేళ్ల అటవీ శాఖ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈవివరాలు వెల్లడించారు. ఉమ్మడి తెలుగురాష్ట్రంలోని భద్రాచలం, ఖమ్మం, తిరువూరు అటవీక్షేత్రాలను కలుపుతూ ఖమ్మంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, అటవీ రీజీనల్ కార్యాలయం 1925లో ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం ఉన్న కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌డీవో కార్యాలయం వరకు అటవీశాఖకార్యాలయం పరిధి ఉండేదన్నారు. వందేళ్లుగా అటవీశాఖ అమరవీరుల స్థూపం ఇక్కడ ఉందన్నారు. గతంలో పని చేసిన అధికారులను సన్మానం చేస్తామన్నారు. ఖమ్మంఅర్బన్‌పార్క్,కనకగిరి గుట్ట, జమలాపురంగుట్ట, ఇతరఅటవీ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పంట నమోదు సమగ్రంగా జరపాలి

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

రఘునాథపాలెం,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో పంటల సాగు వివరాలు సమగ్రంగా జరపాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సూచించారు. శనివారం రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను ఆయన తనిఖీ చేశారు. గ్రామ, క్లస్టర్ స్థాయిలో పంటల నమోదు ఖచ్చితంగా ఉండాలని రైతులు పండించిన పంటలను అమ్మకాలు జరిపే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని సూచించారు. టెక్నికల్ ఏవో పవన్, ఏఈవో శిరణ్మయి పాల్గొన్నారు.

సండ్రను మాదిగ జాతి మర్చిపోయింది

» దళితుల మధ్య చిచ్చు పెట్టే కుటిల ప్రయత్నాలు మానుకోవాలి
» ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ దశాబ్దాలుగా కట్టుబడి ఉంది
» ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొందయ్య



ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను మాదిగ జాతి ఎప్పుడో మర్చిపోయిందని, ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో దళితులకు ఏమేరకు న్యాయం చేశారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య ప్రశ్నించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్‌తో అసెంబ్లీ వరకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇప్పుడు దళితుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దకాలాల నుంచే ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని బహిరంగంగా ప్రకటించిన సంగతి సండ్ర తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పదవి లేక పోవటంతో ఇప్పుడు సండ్ర వెంకటవీరయ్యకు మాదిగ జాతి గుర్తుకొచ్చిందని, కాంగ్రెస్ పార్టీతోనే దళితులకు రాజకీయ,ఆర్థిక సామాజిక న్యాయం జరిగిందన్నారు. విద్యార్థులకు విదేశి విద్యాపథకం నుంచి ప్రతి దళిత కుటుంబానికి రుణాలను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉందన్నారు. స్వయం ఉపాధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు కార్యచరణ చేస్తుందన్నారు. నాయకులు మద్దినేని రమేశ్, తోళ్ల రాకేష్, కొలికబొందు సుదర్శన్, వంగూరి రవి, కుక్కల నరేశ్, గుడిబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా హార్వెస్ట్ వార్షికోత్సవం

» హాజరైన మంత్రి తుమ్మల



జ్యోతప్రజ్వలన చేస్తున్న దృశ్యం



విద్యార్థినుల నాటక ప్రదర్శన

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మ నగరంలోని హార్వెస్ట్ విద్యాసంస్థల 23వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సమాజంలో పోటీతత్వం బాగా పెరిగిందని, అందుకు తగ్గట్టుగానే విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురాల్సిన అవసరం ఉందన్నారు.ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యాసంస్థలకు పంపిన ఘనత హార్వెస్ట్ విద్యాసంస్థలదన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు బోధించే పద్ధతులలో వర్క్‌టు లెర్న్ పద్ధతిలో పాఠం నేర్పిస్తే జీవితకాలం గుర్తుంటుందన్నారు. ముఖ్యంగా సైన్స్ సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు ఈ పద్ధతిని అవలంబించి విద్యార్థులకు చదువునేర్పిస్తే శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి చూపుతారన్నారు. విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నాగమణి, కరస్పాండెంట్ రవి మారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాట్లాడారు. ఒత్తిడిలేని విద్యను అందిస్తూ బాల్యానికి భరోసాను అందించటమే హార్వెస్ట్ లక్ష్యమన్నారు. రేపటి తరానికి కావాల్సిన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోని విద్యార్థులు సమాయత్తం కావాలన్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలతో పాటు సైన్స్ ఫెయిర్‌లలో పలు పతకాలను విద్యార్థులు సాధిస్తున్నారని గుర్తు చేశారు.తల్లి తండ్రుల కోరికలకు అనుగుణంగా పిల్లలపై ఒత్తిడి తీసుకురాకుడదన్నారు.

నిరాశ మిగిల్చిన నిర్మలమ్మ పద్దు

(7వ పేజీ తరువాయి)

ఉద్యోగాల్లో చేరిన వారికి ఆదాయ పన్ను మినహాయింపు కలిసి వస్తుంది. నెలకు లక్షలోపు జీతం కలిగిన ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగికి పన్ను మినహాయింపు లభించనుంది.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి భరోసా కల్పించారు. దేశంలో వంద అగ్రి జిల్లాలను ఎంపిక చేసి అక్కడ రైతులకు అధునాతన వంగడాలతో పాటు చిరుధాన్యాలు పంటల సాగుకు ప్రోత్సాహం, రైతులకు అవసరమైన ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానం, నీటి వసతులు కల్పించనున్నారు. అలాగే రైతులకు క్రెడిట్ కార్డు మీద రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి పెంచారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధర విషయంలో కొంత భరోసా కల్పించారు. అలాగే వీధి వ్యాపారులతోపాటు డెలివరీ బాయ్స్ వంటి వారికి ఈసారి గుర్తింపు పథకాలను ప్రవేశపెట్టింది. దీనితో ఉమ్మడి జిల్లాలోని వీధి వ్యాపారులకు, డెలివరీ బాయ్స్‌కు ప్రయోజనం కలగనుంది.

-ఖమ్మం సాంస్కృతికం/ఖమ్మం మార్కెట్/ఖమ్మం బైపాస్‌రోడ్డు

ఆశించినంత ప్రయోజనకరంగా లేదు

● కూరపాటి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా నాయకుడు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంత ప్రయోజనకరంగా లేదు. కేవలం ఉద్యోగులకు రూ.12లక్షల ఆదాయానికి రాయితీ తప్ప మిగిలిందేమీ లేదు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు కూడా పథకాలకు, బడ్జెట్లో ఆశించిన కేటాయింపులేమీ లేవు. ఇది నామ మాత్రపు బడ్జెట్.

ఇది మాయలేడి బడ్జెట్

● నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రకటించిన 2025-26 బడ్జెట్ మాయలేడిని మరిపించే బడ్జెట్‌గా ఉంది. ఢిల్లీ, బీహార్ ఎన్నికల కోసం ఓట్లకు గాలం వేసే విధంగా ఉంది. గిట్టుబాటు ధరలు, మద్దతు ధరల ఊసే లేదు. వ్యవసాయ రంగానికి, సంక్షోభానికి పరిష్కారం లేదు. అంతేకాకుండా విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు లేనే లేవు. పీఎస్‌యూలు, ఎల్‌ఐసీకి ఎసరు పెట్టేవిధంగా ఉంది. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించింది.

టాక్స్ చెల్లింపుదారులకు లాభదాయకం

● ఉల్లిబోయిన సైదులు, టాక్స్ ప్రొఫెషనల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు



2025-26 బడ్జెట్ టాక్స్ చెల్లింపుదారులకు కొంత లాభదాయకంగా ఉంది. ముఖ్యంగా ఇన్‌కమ్ టాక్స్ స్లాబు సిస్టంలో మార్పులు, బేసిక్ మినహాయింపు పెంపు, టీడీఎస్ టీసీఎస్ పరిమితి పెంపు మధ్యతరగతి ప్రజలకు వెసులుబాటే. అంతేకాకుండా ఇన్‌కమ్ టాక్స్ చట్టంలో అనవసరమైన సెక్షన్స్ తొలగిస్తామని చెప్పడం బాగుంది. చిన్న, చిన్న వీధి వ్యాపారులకు రూ.30వేల పరిమితితో కూడిన క్రెడిట్ కార్డులు ఇస్తామనడం బాగుంది. ఎవరూ ఊహించని విధంగా రూ.12లక్షల వరకు ఆదాయం ఉన్న వారు ఎటువంటి టాక్స్ చెల్లించనవసరం లేదని చెప్పటం వేతన జీవులకు భారీ ఊరట కలుగుతుంది.

గుప్పుమంటున్న గంజాయి..

» గంజాయి మత్తులో చిద్రమవుతున్న యువత » సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమంగా గంజాయి రవాణా



కొత్తగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత భవిష్యత్ వ్యసనాలకు పూర్తిగా బానిసలవుతున్నారు..మత్తులో తూలుతూ.. మత్తుకోసం అరాటపడుతున్న యువత పలు రకాలుగా డ్రగ్స్, మద్యం, మత్తు పదార్థాలను ఆశ్రయిస్తోన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు ఖమ్మం జిల్లాలో సైతం జోరుగా గంజాయి వాడకం ఎక్కువవుతోంది. మత్తుకోసం వ్యసనాల బారిన పడుతున్న యువతను ఆసరా చేసుకుని కొందరు ఆక్రమణదారులు గంజాయిని సరఫరాచేసి లక్షలాది రూపాయలు డబ్బులు సంపాదిస్తున్నారు. యువతకు మత్తును అలవాటుచేసి తప్పుదోవపట్టిస్తున్నారు. గంజాయిమత్తుకు అలవాటుపడి తమ భవిష్యత్‌ను కాలరాసుకుంటున్నారు. మత్తుకు బానిసై ఘర్షణలకు దిగడం.. వ్యక్తులకు దాడులకు పాల్పడటం.. వంటి నేరాలకు పాల్పడుతున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై పోలీసులు ఇటీవల కాలంలో ఉక్కుపాదం మోపుతూ వాహనాలను తనిఖీ చేస్తూ గంజాయిని పట్టుకుంటున్నారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేసి జైళ్లకు తరలిస్తోన్నారు. అయినా గంజాయి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. పోలీసుల కళ్లు కప్పి చాకచక్యంగా గంజాయిని వివిధ వాహనాల్లో అక్రమంగా వారికి కావాల్సిన ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలను గడిపిస్తోన్నారు. భద్రాద్రి కొత్తగూడెం సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా వివిధ వాహనాల్లో హైదరాబాద్, విజయవాడ, కర్ణాటక, చెన్నయ్ తదితర ప్రాంతాలకు గంజాయిని అక్రమంగా తరలి స్తున్నారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో యువత చెడువ్యాసనాలు, గంజాయికి బానిస అవుతున్న నేపథ్యం లో వారిని దృష్టిలో పెట్టుకుని ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని గంజాయి విక్రయాలను జరిపిస్తోన్నారు. రోడ్డు మార్గాన హైదరాబాద్, బెంగుళూరు ఇతర రాష్ట్రాలకు వెళ్లే వాహనాలను పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అనుమానాస్పదస్థితిలో వాహనాలను తనిఖీ చేసినప్పుడు అక్రమంగా గంజాయి రవాణా వాహనాలు ఏ విధంగా తరలిస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.

ఇటీవల బూర్గంపాడు మండలానికి చెందిన ఇద్దరు విలేకరులు కారులో గంజాయి రవాణా చేస్తున్న సమయంలో భద్రాచలంలో పోలీసులకు అనుమానం వచ్చి కారును ఆపి పరిశీలించడంతో గంజాయి ప్యాకేజీకి సంబంధించిన బండిల్స్ లభించాయి. 85 కేజీల గంజాయి లభించడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు ఎన్ని రకాలుగా తనిఖీలు చేస్తున్నప్పటికీ అక్రమార్కులు ఏదోఒక రకంగా గంజాయి మత్తుపదార్థాన్ని వారు చేర్చవల్సిన స్థలానికి చేరుపోవాల్సివస్తోంది.

ఇటీవల కాలంలో జిల్లాలో ఎక్సైజ్, పోలీసుల ఆధ్వర్యంలో భద్రాచలం ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువ చేసే గంజాయిని పట్టుకుని కేసులు నమోదు చేసిన దాఖలాలు ఉన్నాయి.

స్వర నీరాజనం...



శేష వాహనంపై శ్రీ సీతారామచంద్రస్వామి

(7వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా తొలిసారి భద్రాద్రి దేవస్థానం యూట్యూబ్ ఛానెల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది.

పంచామృతాలతో రామదాసుకు అభిషేకం

రామదాసు జయంతిని పురస్కరించుకొని గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో సారె, పసుపు, కుంకుమతోపాటు ప్రత్యేక హారతిని గోదావరికి సమర్పించారు. నగర సంకీర్తన, భాజభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ రామాలయ ప్రాంగణంలో ఉన్న రామదాసు విగ్రహానికి ముఖ్య అర్చకుడు పెరంబుదూర్ మదన్ మోహనాచార్యులు పంచామృతాలతో సహస్రధార, ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. అంతకు ముందు శ్రీసీతారామచంద్రస్వామి మూలవరులకు రామదాసు పేరిట ప్రత్యేక అష్టోత్తరం నిర్వహించారు. అలాగే ఉత్సవానుజ్ఞ తీసుకొని రామాయణ చూర్ణికా విన్నపం, అర్చన, నివేదన, నీరాజనం నిర్వహించారు.

నవరత్న కీర్తనలతో నీరాజనం

భద్రాద్రి రామయ్యకు నవరత్న కీర్తనలతో సంగీత కళాకారులు నీరాజనం పలికారు. భద్రాచలం రామదాసు నవరత్న కీర్తనలను సంగీత కళానిది డాక్టర్ నేదునూరి కృష్ణమూర్తి, మల్లాది సోదరులు రూపొందించగా వాటిని రామదాసు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలపించారు. సంగీతాభిమానులు భక్తిపారవశ్యంతో తన్మయత్వం చెందారు. అదిగో భద్రాద్రితో ప్రారంభమై శ్రీరామనామమే, పలుకే బంగారమాయెనా శ్రీరాముల దివ్యనామ, రామజోగి మందు, తారకమంత్రం, హరి హరి రామ, తక్కువేమి మనకు, కంటినేడు మా రాములతో నవరత్న కీర్తనలు ఆలపించారు. భక్తులు ఆనందపరవశులయ్యారు. ఈ సమయంలో ఒక్కొక్క కీర్తన ముగిసిన అనంతరం ప్రత్యేకహారతిని సీతారామచంద్రస్వామికి ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు సమర్పించారు.

భక్త రామదాసు చిత్రపటంతో గిరి ప్రదక్షిణ

శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం నుంచి భక్తరామదాసు చిత్రపటంతో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలతో గిరి ప్రదక్షిణ నిర్వహించి ముందుగా విస్తాకాంప్లెక్స్ వద్ద ఉన్న తూము నరసింహాదాసు, కల్యాణ మండపం వద్ద ఉన్న భక్తరామదాసు విగ్రహం వద్దకు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాలసాయిబాబా, కత్తి శ్రీనివాస్, శ్రీచక్రా సిమెంట్స్ అధినేత నేండ్రగంటి కృష్ణమోహన్, ప్రసిద్ధ సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, మల్లాది శ్రీరామ్‌కుమార్, మల్లాది రవికుమార్, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలాచార్యులు, కోటి శ్రీమన్నారాయణాచార్యులు, ముఖ్య అర్చకులు శ్రీపెరంబుదూర్ మదన్ మోహనాచార్యులు, దేవస్థానం వేద పండితులు ద్వివేదుల సత్యసాయి సన్యాసిశర్మ, లింగాల రామకృష్ణ ప్రసాద్, కామేశ్వర శర్మ, వేన్నూతుల వరప్రసాద్ శర్మ, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

కీర్తనలతో నీరాజనం

భక్తరామదాసు కీర్తనలతో సంగీత కళాకారులు, కళాభిమానులు రామయ్యకు నీరాజనం పలికారు. విజయవాడకు చెందిన ప్రసిద్ధ సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు వారి బృందం, భక్తరామదాసు కీర్తనలను ఆలపించారు. అదేవిధంగా మల్లాది బ్రదర్స్ మల్లాది శ్రీరాంప్రసాద్, డాక్టర్ మల్లాది రవికుమార్‌లు కీర్తనలను ఆలపించగా భక్తులు సంగీతాభిమానులు భక్తితన్మయత్వం చెందారు. వయొలిన్.. శివకృష్ణ స్వరూప్, మృదంగం.. ఎం.చంద్రకాంత్, తబలా.. ఎన్.గుణరంజన్‌లు వాయిద్య సహకారం అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన కృష్ణమోహన్, కె.శేషులత విశ్వనాథ్ వారి శిష్య బృందం, వైజాగ్‌కు చెందిన లలిత చంద్రశేఖర్ వీరగంట వారి శిష్య బృందం రామదాసు కీర్తనలు ఆలపించి మంత్రముగ్ధులను చేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి మ్యూజిక్ అకాడమీ, వైజాగ్‌కు చెందిన చైతన్య బ్రదర్స్ చెన్నైకి చెందిన సికిల్ గురుచరణ్, వైజాగ్‌కు చెందిన డా.జి.శారదా సుబ్రమణ్యం, సరస్వతి విద్యార్థులు తమ గాత్రంతో శ్రోతలను ఆకట్టుకున్నారు.



వేదిక వద్దకు స్వామి వారిని తీసుకొస్తున్న దృశ్యం



గోదావరికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

అమ్మకమునకు కలవు

నరిత క్లినిక్ సెంటర్‌కి దగ్గరలో పడమర దక్షిణం రోడ్డు కలిగిన మూడు అంతస్తుల బిల్డింగు మరియు దాని ప్రక్కన ఖాళీ స్థలము మొత్తము 130 గజాలు 18000 నెలకు అద్దెలు వచ్చు ఇల్లు 75 లక్షలకు అమ్మబడును. సెల్: 9912804764, 9010100525 AJM:187800

మహాకుంభమేళ

కాశీ, అయోధ్య 7రోజుల టూర్ ప్యాకేజి మరియు రెండు పూటల భోజనం పొద్దున టిఫిన్ కలిపి. ఏసీ సిట్టింగ్ రూ.10,000, ఏసీ స్లీపర్ రూ.12,000 మాత్రమే. దర్శనం, ఆటో ఛార్జీలు, రూమ్ ఖర్చులు ప్రయాణికులవి శ్రీ శ్యామ్ బస్ & కార్ ట్రావెల్స్, రాపర్తినగర్, ఖమ్మం. సంప్రదించగలరు: సెల్: 9440144890, 9949970399 AJM:187841

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

స్వదేశాగమనము/ విదేశీయానం. | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం | షష్టిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి | పదవీవిరమణ

వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు

ఖమ్మం : 9985401672

4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only

ఖమ్మం 9985406151 9985401698

కొత్తగూడెం: 9985400885

భద్రాచలం: 9985411347



బాలికను వేధిస్తున్న యువకుడు: పోక్సో కేసు నమోదు

ఖమ్మంక్రైం ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధిస్తున్న ఓ యువకుడిపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి పోక్సోకేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని త్రీటౌన్ ఏరియా పరిధిలో నివసించే 17ఏళ్ల బాలిక ఓ పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. కొన్నిరోజులుగా నగరానికి చెందిన శ్రావన్ అనే యువకుడు ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం ఆమె చదివే స్కూల్‌వద్దకు వెళ్లి ఇబ్బందిపెట్టాడు. దీంతో ఈ విషయం బాలిక తండ్రికి చెప్పటంతో తండ్రి శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు యువకుడిపై కేసు నమోదు చేశారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటిశ్రీనివాసరెడ్డి ఆదివారం నేలకొండపల్లిలో పర్యటించనున్నారు. శనివారం నుంచి ప్రారంభమైన భక్తరామదాసు జయంత్యుత్సవాల ప్రారంభ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడి పాల్గొనాల్సి ఉంది. అనివార్య కారణాల వలన శనివారం పాల్గొనలేదు. ఆదివారం జరుగుతున్న జయంత్యుత్సవాల్లో జరిగే కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నారు. కావున అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కరాటే శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు పీఎంశ్రీ పథకం క్రింద స్వీయరక్షణకు సంబంధించి కరాటే తర్ఫీదు ఇచ్చేందుకు నిపుణులైన కరాటే శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీవైఎస్‌వో సునిల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎంపిక చేసిన 25పాఠశాలలో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, నెలకు రూ.10వేల పారితోషికం ఇవ్వనున్నట్లు తెలిపారు.బ్లాక్‌బెల్ట్ కలిగిన మహిళా శిక్షకులకు తొలిప్రాధాన్యత ఉంటుందని, వారు లేని యెడల పురుష అభ్యర్థులకు అవకాశం ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల5 కల్లా దరఖాస్తులను పటేల్ స్టేడియంలోని కార్యాలయంలో అందించాలని కోరారు.

పెయింటర్స్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఖమ్మంచర్చికాంపౌండ్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడుగా ఇవై.గిరి, ప్రధాన కార్యదర్శిగా కార్లపాటి శ్రీనివాస్, కోశాధికారిగా యడ్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా పాకాలపాటి రాము, సహాయ కార్యదర్శిగా గడదాసు గోపీనాథ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పావురాలనాగేశ్వరరావు, జంగం నగేష్, వీరబ్రహ్మం, పాలడుగు నగేష్‌లు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి పొలాలను కాపాడాలి

నేలకొండపల్లి,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పలనర్సింహాపురం సమీపంలో ఉన్న భద్రాద్రి స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కాలుష్యం వల్ల పొలాలు నాశనం అవుతున్నాయని మండల బీజేపీ బృందం ఆందోళన వ్యక్తం చేసింది. రైతుల కోరిక మేరకు శనివారం ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల నల్లబడిపోతున్న పొలాలను పరిశీలించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు. పాగర్తిసుధాకర్, సయ్యద్ మొహినుద్దీన్, ల్యాణం నాగేశ్వరరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, గోవిందరావు తదితరులు పొలాలను పరిశీలించిన వారిలో ఉన్నారు.

120మందితో పారిశుధ్య డ్రైవ్

- 20, 21 డివిజన్లలో రహదారులు శుభ్రం
- పర్యవేక్షించిన కమిషనర్ అభిషేక్

ఖమ్మంసంక్షేమ విభాగం,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగరంలో పారిశుధ్యంలో మోడల్‌గా అమలు చేస్తున్న పారిశుధ్య గ్యాంగ్‌వర్క్ శనివారం కొనసాగింది. 120 మంది కార్మికులతో 20, 21వ డివిజన్లలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మమతా రోడ్డు, గొల్లగూడెం ప్రధానమైన వీదులు, సైడ్‌డ్రేనేజీల్లో పనులు చేశారు. పనులను పరిశీలించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్మికులకు పలు సూచనలు చేశారు. రహదారులు, సైడ్‌డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. చెత్త,వ్యర్థాలను ట్రాక్టర్‌ల ద్వారా తరలించాలని ఆదేశించారు. మమతా రోడ్డులో పుట్‌పాత్‌ల నిర్మాణాలు చేసేందుకు అవకాశాలను కమిషనర్ పరిశీలించారు.

డిజిటల్ చెల్లింపుల దిశగా

మహిళా సంఘాల్ని ప్రోత్సహించాలి

- మెప్మా పీడీ మహేందర్
- 30మంది ఆర్పీలకు పీవోఎస్ మిషన్లు పంపిణీ



మిషన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల్ని డిజిటల్ చెల్లింపుల దిశగా ప్రోత్సహించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్, స్త్రీనిధి రీజినల్ మేనేజరు రవీంద్రనాయక్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన వైరా మున్సిపాలిటీ, ఖమ్మం నగర పాలక సంస్థ ఆర్పీల సమావేశంలో మాట్లాడారు. స్త్రీనిధి ద్వారా మంజూరు జరిగిన 30 పాయింట్ ఆఫ్ సేల్స్ మిషన్లను అందించారు. స్త్రీనిధి చెల్లింపులు డిజిటల్ విధానం ద్వారా ఆర్థిక లావాదేవీలు జరపాలని పిలపునిచ్చారు. డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, సీవోలు సల్మా, ద్రౌపతి, ఉపేంద్ర, రోజా పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి గొలుసు అపహరించిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరెంపుల గ్రామానికి చెందిన ఎం.ఉప్పలమ్మ ఒంటరి మహిళ.. కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తుంది. శుక్రవారం రాత్రి ఇంటికి ఉన్న మెస్‌డోర్ వేసుకుని పడుకుంది. శనివారం తెల్లవారుజామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మెస్‌డోర్ కత్తిరించి ఇంట్లో చొరబడ్డారు. ఇంట్లో నిద్రిస్తున్న ఉప్పలమ్మ మెడలోంచి సుమారు 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.





నేలకొండపల్లిలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు, భక్తరామదాసు కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

భక్తరామదాసు జయంతి ఉత్సవాలు ప్రారంభం

- అలరించిన భక్తరామదాసు కీర్తనలు
- నేలకొండపల్లిలో ఘనంగా వేడుకలు ప్రారంభం

నేలకొండపల్లి,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):భక్తరామదాసు జన్మస్థలమైన నేలకొండపల్లిలో, రామదాసు నడయాడిన ధ్యానమందిరంలో రామదాసు 392వ జయంత్యుత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ధ్యానమందిరంలో గోపూజను నిర్వహించారు. అనంతరం భక్తరామదాసు చిత్రపటాన్ని చేత పట్టుకుని భక్తులు, విద్యార్థులు, ప్రజలతో నగర సంకీర్తనను నిర్వహించారు. నగర సంకీర్తన అనంతరం ధ్యానమందిరంలో ఏర్పాటు చేసిన రామదాసు కాంస్య విగ్రహానికి అభిషేకాలు చేశారు. పూజలు చేసిన అనంతరం, భద్రాచలం ఏఈఓ భవాని రామకృష్ణ జ్యోతిప్రజ్వలన చేయటంతో జయంత్యుత్సవాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి.రామకృష్ణ మాట్లాడుతూ భద్రాచలం దేవాలయాన్ని నిర్మించిన కంచర్ల గోపన్న(భక్తరామదాసు) నడయాడిన నేలకొండపల్లిలోని ధ్యానమందిరంలో జయంత్యుత్సవాల్లో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. భాషాసాంస్కృతికశాఖ, భద్రాచలం దేవస్థానం సహకారంతో ఉత్సవాలను నిర్వహించటానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

ఆకట్టుకున్న రామదాసు వేషధారణ...

రామదాసు వేషధారణలో ధ్యాన మందిరంలో తిరుగుతున్న వ్యక్తి అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. నేలకొండపల్లి గ్రామ పంచాయతీలో శానిటరీ మేస్త్రీగా పని చేస్తున్న ముక్కంటి శ్రీను భక్తరామదాసు వేషధారణలో నగర సంకీర్తనలో పాల్గొన్నాడు. ఆయన్ను పలువురు అభినందించారు. మొదటిరోజు ధ్యాన మందిరంలో నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రామదాసు కీర్తనల గోష్టి గానం, రామదాసు కీర్తనల ఆలాపన, సంగీతసభ, భజన కార్యక్రమం అలరించాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భద్రాచలం ఏఈఓ భవాని రామకృష్ణ

మొదటిసారి ఆడిటోరియంలో...

భక్తరామదాసు జయంత్యుత్సవాలు, ఆరాధనోత్సవాలను ఆడిటోరియంలో నిర్వహించుకోవాలన్న నేలకొండపల్లి వాసుల చిరకాల వాంఛ ఎట్టకేలకు తీరింది. ఆరున్నర సంవత్సరాల నిరీక్షణ ఫలించి తొలిసారిగా జయంత్యుత్సవాలను నూతనంగా నిర్మించుకున్న ఆడిటోరియంలో జరుపుకోవటం నేలకొండపల్లి వాసులకు ఎంతో ఆనందాన్నిచ్చిందనటంలో ఎటువంటి సందేహం లేదు.

కాంట్రాక్టు ఉద్యోగి హఠాన్మరణం

ఖమ్మంక్రైం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగి గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎస్పీ ప్రధాన కాలువపై కాంట్రాక్ట్ పద్ధతిలో లష్కర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.చంద్రయ్య(54) ఖమ్మం నగరంలో నవాసముంటున్నాడు. శనివారం రాత్రి నగర శివారులోని పుట్టకోటలో తన బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. మూత్ర విసర్జన కోసం రోడ్డుపక్కకు ద్విచక్రవాహనాన్ని ఆపాడు. దిగిన తరువాత అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతిచెందాడు. అది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించటంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతులను ముంచిన ప్రైవేటు విత్తనాలు

- 30 ఎకరాల్లో ముందే ఈనిన వరిపంట

రఘునాథపాలెం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విత్తన కంపెనీ మోసం కారణంగా వరి రైతులు నష్టపోయారు. ఈ ఘటన రఘునాథపాలెం మండలంలో జరిగింది. కోయచెలక గ్రామంలో 30ఎకరాల వరిసాగు ముందుగానే ఈనటం మొదలైంది. దీంతో రైతులు ఆవేదనకు గురైతున్నారు. ఇలాముందుగా వరి ఈనటం ద్వారా దిగుబడి తగ్గి తాలు పెరుగుతుందని చెబుతున్నారు. ఓ ప్రైవేట్ విత్తనాలతో మోసపోయామని ఏవోకు ఫిర్యాదు చేశారు. శనివారం మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరావు పంటలను పరిశీలించారు. జిల్లా అధికారులకు సమాచారం అందించారు.



విలువలతో కూడిన విద్యనందించాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- ఘనంగా న్యూఇరా వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): జాతినిర్మాణం తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని న్యూఇరావిద్యా సంస్థల 30వంసతాల వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యాసంస్థలు ముప్పై వసంతాల సుదీర్ఘ ప్రస్థానాన్ని కొనియాడారు. విద్యార్థులకు విద్యనే కాక భవిష్యత్తులో స్థిరపడేందుకు కావాల్సిన సలహాలు, సూచనలను అందించాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు.రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ విద్యాదార్శనీకత, క్షేత్రస్థాయి లక్ష్యాల ఉద్దేశ్యంతో స్థాపించబడిన విద్యాసంస్థలు మాత్రమే సుదీర్ఘకాలం మనుగడ సాగిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యాసంస్థల చైర్మన్ ఇంజం రమణారావు, డైరెక్టర్ డాక్టర్ భూమేశ్వరరావు మాట్లాడారు. సమాజంలో తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులకు తిరులేని విద్యను అందిస్తున్నామన్నారు.విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో నెంబర్‌వన్ విద్యాసంస్థగా నిలబెట్టే ప్రణాళికలతో ముందుకువెళుతున్నామన్నారు. ఈకార్యక్రమానికి ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జి.కాంతారావు, నవీన్‌బాబు తోపాటు ప్రముఖులు హాజరయ్యారు.



మంత్రి తుమ్మలకు జ్ఞాపిక అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

రుద్రాక్ష ఎగ్జిబిషన్ ప్రారంభం



ఖమ్మంబైపాస్‌రోడ్డు ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్లో రుద్రాక్షల ప్రదర్శనను ఓంశ్రీ నేపాల్ రుద్రాక్ష మేనేజింగ్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఏకముఖ రుద్రాక్షల నుంచి21ముఖముల రుద్రాక్షలు, దక్షిణావృత శంకాలు, సాలిగ్రాంలు, తులసి మాలలు, కరంగళి మాలలు, స్పటిక మాలలు లభిస్తాయన్నారు. ఈప్రదర్శన ఈ నెల 6వరకు అందుబాటులో ఉంటుందనితెలిపారు. కార్యక్రమంలో జయవిలాసిని డెవలపర్స్ అధినేత రాంబాబు, ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్ అధినేత రమణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఖమ్మంరూరల్,జనవరి1(ఆంధ్రజ్యోతి):ఏదులాపురం మున్సిపాలిటి పరిదిలోని చిన్నతండా, వరంగల్ క్రాస్ రోడ్డుతదితర గ్రామాలకు చెందిన పలువురు వివిధ ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్న వారికి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజురైన రూ.150వేల సీఎం రీలీఫ్ ఫండ్ చెక్కులను సీపీఎం మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి శనివారం బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందిగామ కృష్ణ, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

ఖమ్మంక్రైం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పి.వెంకటకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.799790చెక్కును సీపీ సునిల్‌దత్ తన కార్యాలయంలో అందించారు. శాఖపరంగా ఎటువంటి సహాయ అందించేందుకు అయినా పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారని, అన్నివిధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మంసాంస్కృతికం,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) బీఆర్‌ఎస్ క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాజీ ఎమ్మెల్యే సండ్రవెంకటవీరయ్యతో కలిసి శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, కనగాల వెంకటరావు పాల్గొన్నారు.

మార్కండేయస్వామి జయంతి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):ఖమ్మంజిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయస్వామి జయంతిని శనివారం నిర్వహించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ఆధ్వర్యంలో రంగనాయకుల గుట్ట నందు ఈవేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కండేయస్వామి గుడి నిర్మా ణానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, 34వడివిజన్ కార్పొరేటర్ రుద్రగాని ఉపేందర్, పెండెం జనార్ధన్, బండారు శ్రీనివాసరావు, దుస్సా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని టీడీపీ జిల్లానాయకులు కొండబాల కరుణాకర్ డిమాండ్ చేశారు. శనివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశలో మాట్లాడారు. ఈకార్యక్రమంలో కొప్పుల వెంకటరావు, మల్లీడి నాగన్న, భాగ్యమ్మ, నాగేశ్వరావు, కె.భిక్షం, మండల అధ్యక్షుడు నామా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన కొలికపోగు సోమయ్య ఇటీవల రోడ్డుప్రమాదంలో మరణించారు. దీంతో జాంబవారసుల గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో రూ.75వేలను సోమయ్య కూతురు కొలికపోగు శ్రీతపస్వి పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. శనివారం ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను సోమయ్య కుటుంబసభ్యులకు ఖమ్మంలో సంఘం కార్యాలయంలో తహసీల్దార్ కోటా రవికుమార్ చేతులమీదుగా అందించారు.

నేడు సాహిత్య, సాంస్కృతిక సంరంభం

ఖమ్మంసాంస్కృతికం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఆదివారం పలు సాహిత్య, సాంస్కృతిక కళారంగ కార్యక్రమాలు జరుగనున్నాయి.. ప్రసిద్ధ కథకులు కాళీపట్నం రామారావు ప్రారంభించిన కథానిలయం సాహిత్య సంస్థ వార్షికోత్సవ కార్యక్రమం ఈ దఫా ఖమ్మంలో ఏర్పాటయ్యింది. ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లుగా ఈ కార్యక్రమం జరుగనుంది. కార్యక్రమంలో భాగంగా సాహిత్యవేత్తలు ఘంటా చక్రపాణి, దాసరి అమరేంద్ర, దాసరి రామచంద్రరావు, రవి మారుత్, సీతారాం, సంగిశెట్టి శ్రీనివాస్, కేపీఅశోక్ కుమార్, తిరునగరి దేవకి. తదితరులు పాల్గొంటారు. ప్రభావితం చేసిన తెలుగుకథకులు, ఖమ్మం సాహితీవికాసం, భిన్నకథకులు, భిన్నకథనరీతులు, నాలుగు ప్రాంతాల స్త్రీల కథల్లో తేడాలు, పోలికలు అనే అంశాలపై సాహిత్య ప్రసంగాలతోపాటు పానల్ డిస్కషన్, నిర్వహిస్తారు. మనమెరుగని లాటిన్ అమెరికా అనే పుస్తకాన్ని ముళ్లపూడి సుబ్బారావు పరిచయం చేయనున్నారు. వంశీకృష్ణ కథలు గోధుమ రంగుఊహ కథలను ప్రముఖ కవయిత్రి తోట సుభాషిణి పరిచయం చేస్తారు. ఈసందర్భంగా చర్చావేదికను కేంద్రసాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ నిర్వహిస్తారు. కళీపట్నం సుబ్బారావు, వివినమూర్తి తదితరులుపాల్గొంటారు.

జాషువా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో..

ప్రముఖ సాహిత్య సంస్థ జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం వీడీవోస్‌కాలనీలోని సర్వజ్ఞ స్కూల్‌లో సాయంత్రం జరుగనుంది. గరిడేపల్లి శోభనాద్రి రచించిన కలికితురాయి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.పగిడిపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సభలో, ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు తదితరులు పాల్గొనిప్రసంగిస్తారు.

భాషాసాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో..

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భక్తరామదాసు కళాక్షేత్రంలో సాయంత్రం 7 గంటలకు భూతకాలం అనే ప్రత్యేక నాటికను ప్రదర్శించనున్నారు. నెలనెలవెన్నెల సహకారంతో ప్రదర్శించే ఈనాటిక రచన మాడభూషి దివాకర్ బాబు, దర్శకత్వం గోవాడ వెంకట్ వహించారు. నాటక ప్రదర్శనకు, సాహిత్య వేడుకలకు అభిమానులు హాజరు కావాలని నిర్వాహకులు విన్నవించారు.


భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం



నేలకొండపల్లి,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, నేలకొండపల్లి వారి ఆధ్వర్యంలో శనివారం నేలకొండపల్లి పాతబస్టాండ్ వద్ద ఉన్న భక్తరామదాసు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. భక్తరామదాసు నేలకొండపల్లి వాసిగావటం మనందరి అదృష్టమన్నారు. రామదాసు కీర్తనలు నలుదిశలా వ్యాప్తి చేయటానికి సొసైటీ తరపున కృషి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతో తలసీమియాను అరికట్టవచ్చు

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): తలసీమియాపై అవగాహనతో వ్యాధిని అరికట్టవచ్చని ఖమ్మంప్రభుత్వ వైద్యకళాశాల సూపరింటెండెంట్‌ఎల్.కిరణ్‌కుమార్ అన్నారు. సంకల్ప స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహనర్యాలీ నిర్వహించారు. తలసీమియా చిన్నారులు, వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 15ఏళ్లుగా సంకల్ప స్వచ్ఛంద సంస్థ బాధిత చిన్నారుల కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇది రక్తసంబంధ వ్యాధి అని, ప్రస్తుతం ఈవ్యాధి నియంత్రణకు ఆధునిక వైద్యచికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఈవ్యాధిపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు పొద్దుటూరి అనిత, ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాల డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, వైద్యులు డి.నారాయణమూర్తి,లక్ష్మీదీప, సంస్థ బాధ్యులు పి.పావని, ఉదయ్ భాస్కర్, రవిచందర్, వంశీ కిరీటి, ఎస్.ఉపేందర్, అనురాధ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

తాగునీటి సమస్యపై సర్వే

రఘునాథపాలెం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి ఎద్దడిపై సర్వే నిర్వహించారు. శనివారం కోయచెలక గ్రామంలో ఏఈ జ్యోతి ఆధ్వర్యంలో సర్వే చేపట్టగా మొత్తం రెండు తాగునీటి బాయి బోర్లు, 18చేతి పంపులను గుర్తించారు. వారిలో 10 చేతి పంపులు వరకు మరమత్తుల అవసరం ఉందని గ్రామకాంగ్రెస్ నాయకులు మాదంశెట్టి హనుమంతరావుకు అధికారులు వివరించారు.

దివ్యాంగుల స్వయం ఉపాధికి దరఖాస్తుల గడువు పెంపు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగులకు స్వయం ఉపాధి పథకం కింద లోన్‌ల కొరకు దరఖాస్తులను ఈనెల 12 వరకు పొడిగించినట్లు జిల్లా వయోవృద్ధుల శాఖ అధికారి కె రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదాయ ధ్రువీకరణ, లేని వాళ్ల తెల్ల రేషన్‌కార్డు ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి గల దివ్యాంగులు మీసేవా, ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా దరకాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ఎస్‌బీఐటీలో క్యాంపస్ డ్రైవ్

61 మంది విద్యార్థుల ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జేబియం సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 61 మంది విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఆటో రంగంలో పెరుగుతున్న ఆదరణ దృష్ట ఎంపికైన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వార్షిక ఆదాయం రూ.2లక్షల నుంచి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరి డాక్టర్ జీ ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో విద్యాసంస్థల చైర్మన్ కృష్ణ



ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. శనివారం మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తోటకూరి రాంబాబు కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఆసుపత్రిలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాంబాబు సతీమణి శోభరాణికి రూ.ఏడున్నర లక్షలకు ఎల్‌వోసిని అందజేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు, నాయకులు అడ్డగొడ్డ అయిలయ్య పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిధిలోని రేగులగూడెం పంచాయతీ రామకృష్ణపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో గల చెరువుకట్టపై ఉన్న కంకరరోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీనాయకులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కోరారు. రహదారిపై ప్రయాణం చేయాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు.


ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

పొలాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

కొణిజర్ల, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామ బాధిత రైతులు శనివారం భారతీయ కిసాన్‌సంగ్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలోని రహదారి అధ్వానంగా ఉందని ఆరోపించారు. తమ కష్టాలను పరిశీలించి పరిష్కారం చూపాలని ఎంపీడీవోను రైతులు కోరారు. రైతులకు మద్దతుగా వచ్చిన భారతీయ కిసాన్‌సంగ్ ఖమ్మం టౌన్ కార్యదర్శి మందనపు రామారావు, మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించి రైతుల బాధలు తీర్చాలని ఎంపీడీవోను వారు కోరారు. ఎంపీడీవో రోజారాణి స్పందిస్తూ డొంకను పరిశీలించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేసే వీలుంటే చేపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లెంపాటి రమేష్, బీకేఎస్ మండల కార్యదర్శి పెదమళ్ళ శ్రీనివాసరావు, రైతులు తుప్పతి కృష్ణయ్య, కవిడ శ్రీను, బీసె రాములు, రెడ్డి, రామారావు తదితరులున్నారు.

మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి: రైతు సంఘం

వైరా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో చివరి దశలో రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని విప్పలమడక, సిరిపురం గ్రామాల్లో రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసి ఉన్న ధాన్యాన్ని శనివారం రాంబాబు సందర్శించి పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి ఖమ్మం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ వినతికి స్పందించిన అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ మిగిలిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, మేడా శరాబందీ, దేవభక్తిని అర్జున్‌రావు, గరిడేపల్లి పుల్లారావు, రుద్రాక్షల మురళీ, సామేలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

» ఎస్ఈ సురేందర్

చింతకాని, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఈ సురేందర్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని కొదుమూరు, నాగులవంచ, చింతకాని, పందిళ్లపల్లి సబ్ స్టేషన్‌లను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. కార్యక్రమంలో డీఈ నంబూరి రామారావు, ఏడీఈ తిలక్, ఏఈలు శ్రీధర్, ఉమమహేశ్వరి పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు మేడేపల్లి విద్యార్థి ఎంపిక



ముదిగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల మూడు నుంచి ఏడోతేదీ వరకు హర్యానాలో జరుగనున్న జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు రాష్ట్రస్థాయి జట్టులో మండలంలోని మేడేపల్లి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థిని యశస్విని ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని యశస్వినిని మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సామినేని రమేష్, కొత్తపల్లి నాగలక్ష్మి, సామినేని వెంకటేశ్వరరావులు అభినందించారు.

హుండీ లెక్కింపు

మధిరటౌన్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మధిర మెయిన్ రోడ్డులో గల శ్రీసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో శనివారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. దేవాదయ, ధర్మాదాయ శాఖ ఖమ్మం జిల్లా పరిశీలకులు ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో మూడు నెలలకు గాను రూ. 55,785వేల ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో రామకోటేశ్వరరావు, అర్చకులు రవిశాస్త్రి పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మధిర రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేసిక్స్ మ్యాథ్స్ బుక్స్‌ను వితరణగా అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో వై.ప్రభాకర్ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు కల్యాణ్‌చక్రవర్తి, ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, కృష్ణమాచార్యులు, శ్రీహరి, ఇబ్రహీం పాల్గొన్నారు.

14న కావడి ఉత్సవం

ఏన్కూరు, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం గ్రామంలోని అతిపురాతమైన శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో ఈనెల14న మహాకావడి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అత్యంత వైభవంగా జరిగే ఉత్సవం ఉదయం 7గంటలకు 250మంది భక్తులతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవంలో పాల్గొనే భక్తులు రూ.516 చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఫ్రీజర్ బాక్సు వితరణ

ఏన్కూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు గ్రామానికి చెందిన కూరాకుల రమేష్ గ్రామపంచాయతీ కార్యాలయానికి శనివారం సుమారు రూ.60 వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్సును సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అందించారు. ఈసందర్భగా ఫ్రీజర్ బాక్సును అందించిన రమేష్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా లాలునాయక్, మాజీ ఉప సర్పంచ్ పటాన్ మజీద్‌ఖాన్, వేల్పులు రవిశంకర్‌ప్రసాద్, శెట్టిపల్లి నరేష్, జయరాం పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేంసూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయుడిపాలెం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బెంచీల వితరణ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యగారిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూ.50వేల విలువగల 12డ్యూయల్ డెస్క్ బెంచీలను శనివారం ఉచితంగా అందజేశారు. పాఠశాలల అభివృద్ధికి స్థానికులతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఎంఈవో నక్కా రాజేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి, లక్ష్మీ, కాంప్లెక్స్ హెచ్ఎం పూరేటి యాకోబు, హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పీ.కిరణ్మయి, రవీందర్‌రెడ్డి, రవికుమార్, ఏఐపీసీ చైర్మన్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.


బెంచీలను అందజేస్తున్న నిర్వాహకులు

'ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలు సరికాదు'

కల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతుల చొరవతో అభివృద్ధి చరిత్ర వెలుగుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కల్లూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, యస్‌కె యాకుబ్‌అలీ, తక్కెళపాటి ప్రసాద్‌లు మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 15 సంవత్సరాల పాటుగా అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తన స్థాయిని విస్మరించి ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌లపై చౌకబారు విమర్శలు చేయడం తగదని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక సండ్ర ఇంకా తాను అధికారంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఈ సమావేశంలో భాగం ప్రభాకరచౌదరి, పెద్దబోయిన శ్రీనువాసరావు, ఎం. విజయరావు, ఆళ్లకుంట నరసింహారావు, యస్‌కే బాజీ తదితరులున్నారు.


కల్లూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడలో....

తల్లాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిపై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వ్యాఖ్యలు అర్థరహితమని తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు ఖండించారు. శనివారం తల్లాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్ మాట్లాడారు. రాయల రాము, కటికి కిరణ్, అజయ్, రవీంద్ర, బసవయ్య పాల్గొన్నారు.

సత్తుపల్లిలో....

సత్తుపల్లి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సత్తుపల్లి నియోజకవర్గంలో అవినీతిని చట్టబద్ధం చేసింది అప్పటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అని సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు, చల్లగుళ్ల నరసింహారావు, కంటె నాగలక్ష్మి, మందపాటి పద్మజ్యోతి, దూదిపాల రాంబాబు, ఎండీ.కమల్‌పాషాలు ఆరోపించారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రస్తుతం డీ ట్యాక్స్ అమలవుతుందంటూ వెంకటవీరయ్య చేసిన ఆరోపణలను వారు ఖండించారు.

వేంసూరులో....

వేంసూరు, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ హయాంలో అవినీతి ఎక్కువగా జరిగిందని మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సమావేశంలో కాసర చంద్రశేఖర్ రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, రాఘవరెడ్డి, సత్యనారాయణ, అట్లూరి సత్యనారాయణరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, మల్లెల నర్సింహారావు, చెన్నకేశవరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మట్టా కుటుంబం, కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం మండలంలోని టేకులపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, మోరంపూడి బాబూరావు, మేకతొట్టి కాంతయ్య, వేముల కృష్ణయ్య, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, గూడూరు మాధవరెడ్డి, కమలాకర్‌రావు తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్ పత్రాల దహనం

వైరా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం వైరాలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమత, నాయకులు చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, గుమ్మా నర్సింహారావు, తోట నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేరుపల్లిలో ఎమ్మెల్యేల పర్యటన


వెంకమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు

కారేపల్లి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లిలో శనివారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు పర్యటించారు. గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్ దామళ్ల సర్వయ్య మాతృమూర్తి దామళ్ల వెంకమ్మ దశదినకర్మకు హజరయ్యారు. ఈకార్యక్రమంలో రాష్ట్రసమితి చైర్మన్ జి.చెన్నయ్య, జిల్లా మాల జర్నలిస్ట్ సహాయకార్యదర్శి కందుల ప్రసాద్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

చేతిపంపు వితరణ

బోనకల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామంలో శనివారం ప్రజలకు నీటి వసతిని కల్పించేందుకు గాను ఖమ్మం జీ.ఎస్.ఎస్ సేవా సంస్థ చేతిపంపును వితరణగా ఏర్పాటు చేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు చేతిపంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుపల్లి ప్రేమ్ కుమార్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

బోనకల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ పల్టీ ఘటనలో మృతి చెందిన వరమ్మ కుటుంబానికి రూ. 25 లక్షలు, గాయపడ్డ కూలీలకు కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. బోనకల్ గ్రామంలో శనివారం సీపీఐ నాయకులు వరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పగిడిపల్లి ఏసు, తాటి వెంకటేశ్వరరావు, ఆకేన పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర బాస్కరరావు, జయరాజు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ధూంధాం

ముదిగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టనున్న వేలాది గొంతులు, లక్షలాది డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం ముదిగొండలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజాయుద్ధ నౌక గిద్దె రాంనర్సయ్య హాజరై ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఆనందరావు, పమ్మి రవి, నూకల నాగేశ్వరరావు, అంజయ్య, వడ్డే అనిల్, పడిశాల నాగేశ్వరరావు, కట్టకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌సీడబ్ల్యూయూ సెక్రటరీగా శరత్

సత్తుపల్లి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (పీఎస్‌సీడబ్ల్యూయూ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా, కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడిగా సత్తుపల్లికి చెందిన అమర్లపూడి శరత్ శుక్రవారం ఇల్లందులో నిర్వహించిన రాష్ట్ర 2వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారినా శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా పోరాటం చేస్తానని శరత్ తెలిపారు. ఈ సందర్భంగ తనను ఎన్నుకున్న జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈజీఎస్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని వినతి

మధిర రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈజీఎస్ సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ మధిర ఈజీఎస్ అధికారులు, సిబ్బంది శనివారం ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ పిలుపు మేరకు ఈజీఎస్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మండలపరిషత్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆవుల సంతోష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జానకిరామిరెడ్డి, జేఈ విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు అనిల్‌కుమార్, బోడేపూడి రాణి, శాంతయ్య, గిరీష్, సుజాత పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా ప్రసాద్

మధిరటౌన్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడిగా సజ్జా ప్రసాద్ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ నియామక పత్రం అందచేశారు. తనపై నమ్మకం ఉంచి తనను పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణోత్ రమణానాయక్ పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలకు బీ గ్రేడ్ గుర్తింపు



మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాల

సత్తుపల్లి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలకు న్యాక్ బీ (సీజీపీఏ 2.45) గ్రేడ్ గుర్తింపు పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయవరపు కుమార్‌రాజా శనివారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని ఫార్మసీ కళాశాలలో న్యాక్ ఎక్రిడిటేషన్ పొందిన ఏకైక ఫార్మసీ కళాశాలగా తెలంగాణ రాష్ట్రం గుర్తింపు పొందిందన్నారు. తమ కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్ సాధించడం పట్ల కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డైరెక్టర్ డాక్టర్ కందిమళ్ల కృష్ణారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ దాసరి ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ధ్వంసంపై స్థానికుల ఆగ్రహం

తల్లాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం అధిక బరువుతో టిప్పర్ల రాకపోకల వల్ల తల్లాడ మండలం మిట్టపల్లి నుంచి రామానుజవరం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి ధ్వంసం కావడంపై శనివారం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు కాంట్రాక్టర్ అక్కడకు చేరుకొని ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బస్ సర్వీసును పొడిగించాలని వినతి

బోనకల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి బోనకల్ మండలం గార్లపాడు గ్రామం వరకు నడుస్తున్న బస్ సర్వీస్‌ను లక్ష్మీపురం వరకు పొడిగించాలని శనివారం ఖమ్మం ఆర్టీసీ డీఎం దినేష్‌కు గోవిందాపురం(ఎల్) నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం డీఎం సోమవారం నుంచి బస్ సర్వీసును పొడిగిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణం నాగేశ్వరరావు, ఉమ్మినేని కృష్ణ, తమ్మారపు బ్రహ్మయ్య, వజ్రాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అల్పాహారం పంపిణీ

ఏన్కూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీని శనివారం ఎంపీడీవో ఎస్.రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కూరాకుల సైదయ్య, ఎంపీవో జీవీఎస్ నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ జి.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు రాఘవరావు, శ్రీధర్, కస్తూరి, విజయలక్ష్మి, పుల్లయ్య పాల్గొన్నారు.

ముదిగొండలో..

ముదిగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పదోతరగతి విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ముదిగొండ మండ లం బాణాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, ఏఏపీసీ చైర్మన్ ఉపేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధిరరూరల్‌లో...

మధిర రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి జడ్పీఉన్నత పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈవో వై.ప్రభాకర్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం బూసా కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు చారి, కిషోర్, జ్యోతిర్మయి, రామచంద్రరావు, శర్మ పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి ముత్యాల కవచాలంకారం

ఎర్రుపాలెం, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరకులపాటి కృష్ణప్రసాద్, ఎల్వీ నారాయణరెడ్డి, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

సీపీఎం నాయకుడు మట్టూరి భద్రయ్య మృతి



కల్లూరు, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు మట్టూరి భద్రయ్య(94) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన మట్టూరి భద్రయ్య 1964 నుంచి 2005 వ సంత్సరం వరకు సీపీఎం పార్టీలో రాజకీయంగా చురుకైన పాత్ర వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

భద్రయ్య మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు సంతాపం తెలిపారు. సీపీఎం నాయకుడు తాత భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావులు సంతాపం, సానుభూతి తెలిపారు.

అయ్యగారిపేట రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యగారిపేటలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ చంద్రస్వామి త్రైయాహ్నిక ఏక కుండాత్మక నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 4నుంచి 4రోజుల పాటు నిర్వహించనున్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళాశాసనాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 7న ప్రతిష్ఠ మహోత్సవం ఏర్పాటు చేశామని సభ్యులు తెలిపారు.


రామాలయం

వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం

» సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి

తల్లాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ ఉత్పత్తులపై మద్దతు ధర చట్టం ఊసే లేకుండా సంక్షేమ పథకాలపై కోత విధించి తీరని అన్యాయం చేశారని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి విమర్శించారు. శనివారం తల్లాడలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వ్యవసాయంతోపాటు ఉపాధిపై బడ్జెట్లో కోత విధించారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, నాయకులు నల్లమోతు మోహన్‌రావు, సత్తెనపల్లి నరేష్, షేక్.మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, బత్తుల హరి పాల్గొన్నారు.

కార్మికులకు సేవలందించాలి

» సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల

పెనుబల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్‌బోర్డులోని భవన నిర్మాణ కార్మికుల నిధులను పక్కదారి పట్టించకుండా కార్మికులకే ఉపయోగించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని లంకపల్లిలో భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు గుడిమెట్ల బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు చిన్నరజీ, షేక్.మస్తాన్, జి.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, తడికమళ్ల శేషగిరి, మరకాల ఆనందరావు, అప్పయ్య పాల్గొన్నారు.

'అసంపూర్తి అభివృద్ధి పనుల బాధ్యత ఎమ్మెల్యేదే'

వైరా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తిచేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి నిధులు సాధించి వెంటనే పనులు ప్రారంభించి ప్రజాధనం వృథా కాకుండా పకడ్బందీగా వెచ్చించాలని సీపీఎం వైరా పట్టణ కమిటీ సమావేశం కోరింది. శనివారం మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు మాట్లాడారు. మునిసిపాలిటీ ఏర్పాటు వలన వైరా ప్రజలకు వచ్చిన ప్రయోజనం ఏమీ లేదని ఆక్షేపించారు. మునిసిపాలిటీ పేరుతో ఇంటిపన్నులు పెంచి ప్రజలపై భారాన్ని మోపారని, ఈజీఎస్ పథకాన్ని అమలుకాకుండా చేశారని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లేకుండాపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హరి వెంకటేశ్వరరావు, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, గుమ్మా నర్సింహారావు, సంక్రాంతి నర్సయ్య, నాగూల్‌పాషా, కృష్ణవేణి, రాంబాబు, రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రవి(ఫైల్)

వైరా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైరాలో శనివారం జరిగిన వేర్వేరు రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ ప్రధాన రహదారి పక్కన ఖాళీ స్థలం లో ఒక స్కూల్ బస్సును నిలిపారు. మండలంలోని దాచాపురం గ్రామానికి చెందిన మోదుగు రవి(40) ఆబస్సు పక్కనే నిద్రకు ఉపక్రమించాడు. బస్సు పక్కన నిద్రిస్తున్న రవిని గమనించకుండా డ్రైవర్ బస్సును కదిలించడంతో వెనుక టైర్ల కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సంఘటనాస్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

ముగ్గురికి గాయాలు...

జాతీయ ప్రధాన రహదారిలోని వైరా నది హైలెవల్ వంతెన సమీపంలో కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయి అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. ట్రాలీ ఆటో ముందు టైర్ పేలిపోవడంతో వాహనాన్ని డ్రైవర్ కంట్రోల్ చేయలేని పరిస్థితిలో 11మంది మొక్కజొన్న కూలీలతో ఉన్న ఆవాహనం పల్టీకొట్టింది. ఈ కూలీలో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైరా ఎస్ఐ సంఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసులు నమోదు చేసి సీఐ సాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డును పునర్నిర్మించాలని నిరసన

వేంసూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం మర్లపాడు సెంటర్ నుంచి జడ్పీపరిషత్ పాఠశాల వరకు గోతులమయంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గుంతల మయంగా ఉన్న ఈ రోడ్డును పునర్నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.


ధర్నా చేస్తున్న మర్లపాడు గ్రామస్థులు